సాక్షి
నిర్మల్
ఆదివారం । 7 । జూలై । 2024



పర్యాటకంపై నీలినీడలు

ఆదిలాబాద్ జిల్లా.. ప్రకృతి అందాలకు నెలవు. అయితే పర్యాటక అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. నిధుల కొరత వెంటాడుతోంది. 8లో▸



అద్దె భవనాల్లో గురుకులాలు

పేద విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయి విద్యను అందించేందుకు గత ప్రభుత్వం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసింది. కానీ ఒక్కటి కూడా సొంత భవనంలో లేదు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.4 /25.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా మోస్తరు వాన కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాల కార్మికులను ప్రోత్సహిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ టీం

లోకేశ్వరం: బాల కార్మికులతో పని చేయించినా, బాల కార్మికులను ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని ఆపరేషన్ ముస్కాన్‌టీం ఎస్సై నారాయణ్‌సింగ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని హోటళ్లు, వెల్డింగ్ షాపులు, కిరాణా దుకాణాల యజమానులకు బాల కార్మిక వ్యవస్థపై శనివారం అవగాహన కల్పించారు. బాల కార్మికులతో పనులు చేయిస్తే యజమానులతోపాటు తల్లిదండ్రులపైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బస్టాండ్, ప్రధాన కూడళ్ల వద్ద పిల్లలతో భిక్షాటన చేస్తూ కనిపిస్తే 1098 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో భైంసా డివిజన్ బాల న్యాయ సలహాదారులు షేర్ నరేందర్, కానిస్టేబుల్ హరీశ్, అనుప్రియ, రాందాస్, రమేశ్, సామాజిక కార్యకర్త మమత, 108 సిబ్బంది కవిత, లోకేశ్వరం వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.


మొక్కలతోనే ప్రకృతి సమతుల్యత



మొక్క నాటుతున్న అధ్యాపకులు, సిబ్బంది

నిర్మల్‌ఖిల్లా: మొక్కలు నాటడం ద్వారా ప్రకృతిని సంరక్షించుకోగలుగుతామని తద్వారా వాతావరణ సమతుల్యతను కాపాడుకోగలుగుతామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే.భీమారావు అన్నారు. 'ఏక్ పేడ్ మాకే నామ్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్ఎస్ఎస్ ఆ.ద్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆర్.నాగేశ్వర్, అధ్యాపకులు వి.సరితరాణి, పవన్‌కుమార్, అరుణ్‌కుమార్, నరసయ్య, రవికుమార్, పీజీ.రెడ్డి, శంకర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

శ్యామప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం



శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: శ్యామప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్యామప్రసాద్ ముఖర్జీ జీవితం దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర నాయకులు రావుల రామనాథ్, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసిమ్మె రాజు, అసెంబ్లీ కన్వీనర్ గాదె విలాస్, నాయకులు అయ్యన్నగారి రాజేందర్, అల్లం భాస్కర్, తోట సత్యనారాయణ, ఆడెపు సుధాకర్, రావుల రాము, జుట్టు దినేశ్ పాల్గొన్నారు.

నిధుల కోసం వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఖానాపూర్ మున్సిపల్ పాలకవర్గం, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో పలువురు అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేసింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ సీడీఎంఏ అధికారి వీపీ.గౌతం, మున్సిపల్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ అధికారి జీయా వుద్దీన్‌తోపాటు పలువురు అధికారులను హైదరాబాద్‌లో శనివారం కలిశారు. సమస్యలు, అభివృద్ధికి కావాల్సిన నిధులను వారికి విన్నవించినట్లు మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం తెలిపారు. అధికారులను కలిసినవారిలో వైస్ చైర్మన్ కావలి సంతోష్, నాయకులు పరిమి సురేశ్, షబ్బీర్‌పాషా తదితరులు ఉన్నారు.

సమస్యల వసతి

సాక్షి విజిట్



ఆరుబయటే..

కుంటాల మండల కేంద్రంలోని వసతిగృహంలో పరిస్థితి ఇది. ఇక్కడ బీసీ వసతి గృహంలోనే ఎస్సీ వసతి గృహం నిర్వహిస్తున్నారు. మొత్తం వందమంది వరకు విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ బాత్రూంలకు తలుపులు లేక విద్యార్థులు ఆరుబయటే నల్లాల కింద స్నానాలు చేస్తున్నారు.



టాయిలెట్ సమస్య..

ఈచిత్రం కడెం మండలంలోని ఎస్సీ వసతిగృహానిది. ఇందులో ప్రస్తుతం 42 మంది విద్యార్థులు ఉన్నారు. గతంలో మండల కేంద్రంలోని అద్దె భవనంలో నడిచిన ఈ వసతి గృహాన్ని రెండేళ్ల క్రితం జిల్లా పరిషత్ పాఠశాల పక్కన భవనంలోకి మార్చారు. ఇక్కడ విద్యార్థులకు ప్రత్యేకంగా టాయిలెట్స్ లేవు. వసతిగృహ విద్యార్థులు పాఠశాల టాయిలెట్స్‌ని ఉపయోగించుకుంటున్నారు. పాఠశాల పనివేళలో ఒంటికి రెంటికి ఇబ్బంది పడుతున్నారు. హాస్టల్ నుంచి టాయిలెట్స్ దూరంగా ఉండటంతో రాత్రిపూట ఇబ్బందులు పడుతున్నారు.

అపరిశుభ్రంగా...

సోన్ మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలోనే ప్రస్తుతం తహసీల్దార్ ఆఫీస్ కూడా కొనసాగుతోంది. ఈ వసతి గృహంలో 26 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో కేవలం మూడు రూములు, ఒక కిచెన్ మాత్రమే ఉన్నాయి. వంటగది అధ్వానంగా మారింది. స్కావెంజర్లు లేకపోవడంతో టాయిలెట్లు శుభ్రం చేయడం లేదు.



- చాలా పాఠశాలలు అద్దె భవనాల్లోనే..
- అరకొర సౌకర్యాలు.. అపరిశుభ్రత..
- అధ్వానంగా మరుగుదొడ్లు
- ఒంటికి, రెంటికి ఇబ్బందే..

నిర్మల్/నెట్‌వర్క్: ప్రభుత్వాలు మారుతున్నా వసతి గృహాల్లో సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఏళ్లుగా వసతిగృహాలను పట్టించుకోకపోవడం, స్థానిక అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది స్థానికంగా ఉండకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై నెల కావొస్తున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో విద్యార్థులు వసతి గృహాల్లోకి రాలేదు. ఇందుకు ఆయా హాస్టళ్లలో నెలకొన్న సమస్యలే కారణమని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైన సందర్భంగా జిల్లాలో బీసీ, ఎస్సీ వసతిగృహాలను శనివారం 'సాక్షి' విజిట్ చేసింది. ఈసందర్భంగా పలు సమస్యలను గుర్తించింది.

అద్దె భవనాలు.. అరకొర వసతులు..

జిల్లాలో బీసీ హాస్టళ్లు 20, ఎస్సీ వసతి గృహాలు 20 ఉన్నాయి. ఒక్కో హాస్టల్‌లో వందమంది చొప్పున విద్యార్థులు ఉండటానికి అవకాశం ఉంది. కానీ.. ఇప్పటికీ పూర్తిస్థాయిలో విద్యార్థులు ఎక్కడా లేరు. జిల్లాకేంద్రంలోని కొన్ని హాస్టళ్లల్లో మాత్రం అధిక సంఖ్యలో విద్యార్థులు ఉంటున్నారు. జిల్లా కేంద్రంలోని వసతి గృహాలన్నీ అద్దెభవనాల్లోనే కొనసాగుతున్నాయి. స్థానిక ఇంద్రానగర్‌లో ఉన్న బీసీ విద్యార్థుల వసతిగృహం పక్కా భవనంలోనే ఉన్నా.. పైఅంతస్తులో వేసిన సిమెంట్‌రేకుల షెడ్డు దెబ్బతింది. దీంతో అందులో ఉంటున్న విద్యార్థులు వర్షాలు కురిస్తే ఇబ్బంది పడుతున్నారు. దిలావర్‌పూర్‌లో వసతిగృహం సరిగా లేకపోవడంతో షాదీఖానాలో అరకొర వసతులతో కొనసాగిస్తున్నారు.

అంతటా అపరిశుభ్రత..

'సాక్షి' చేసిన విజిట్‌లో ప్రధానంగా టాయిలెట్ల సమస్యలు చాలా వసతి గృహాల్లో కనిపించాయి. విద్యార్థులకు సరిపడా లేకపోవడంతోపాటు ఉన్నవి కూడా అపరిశుభ్రంగా ఉన్నాయి. కనీసం క్లీనింగ్ చేయకపోవడంతో కంపుకొడుతున్నాయి. చాలాచోట్ల విద్యార్థులు ఆరుబయట నల్లాల కిందనే స్నానాలు చేస్తున్నారు. హాస్టళ్ల పరిసరాలూ అపరిశుభ్రంగానే ఉన్నాయి. చుట్టూ బురద, పిచ్చిమొక్కలు పెరిగి వర్షాకాలం చూడటానికే భయంగా కనిపిస్తున్నాయి. వసతిగృహాల్లోని గదుల్లోనూ సరైన వెలుతురు లేదు. పగటిపూట కూడా చీకటి ఉండే గదుల్లో చదువుకోలేకపోతున్నామని విద్యార్థులు చెబుతున్నారు.



జిల్లా కేంద్రంలోని నటరాజ్‌నగర్ వసతి గృహంలో పచ్చడితో భోజనం చేస్తున్న విద్యార్థులు



ఇందిరానగర్ ఎస్సీ హాస్టల్‌లో పగిలిన పైకప్పు రేకులు

నిధులే సమస్యలు..

ప్రభుత్వాలు వసతిగృహాలపై పెద్దగా దృష్టి పెట్టకపోవడమే ప్రధాన సమస్య. ఎప్పుడో నిర్మించిన వసతిగృహాల్లో చాలావరకు శిథిలావస్థకు చేరాయి. ఈక్రమంలోనే చాలా వాటిని ప్రైవేటు భవనాల్లోకి మార్చారు. నిర్వహణ ఖర్చులు పెరుగుతున్నా.. వాటికి సరిపడా నిధులు రావడం లేదు. వసతిగృహాల్లో సౌకర్యాలు కల్పించాలని ఏళ్లుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నా.. ప్రభుత్వాల నుంచి ఎలాంటి స్పందన రావడం లేదు. సరైన సౌకర్యాలు లేనందునే జిల్లాలోని చాలా వసతి గృహాల్లో ఇప్పటికీ సీట్లు ఖాళీగానే ఉంటున్నాయి.

సౌకర్యాలు కల్పిస్తున్నాం..

వసతిగృహాలకు వస్తున్న నిధుల మేరకు విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నాం. జిల్లాలో ఉన్న సమస్యలు, కావాల్సిన నిధుల గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. సాధ్యమైనంత వరకు విద్యార్థులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నాం.
– రాజేశ్వర్‌గౌడ్, సంక్షేమాధికారి

వ్యాధుల కాలం.. అప్రమత్తత అవసరం

- వర్షాలతో పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా మందులున్నాయి
- దోమల నివారణకు ప్రతీ మంగళ, శుక్రవారం డ్రై డే..
- గర్భిణుల కోసం బర్త్ వెయిటింగ్ సెంటర్లు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీఎంహెచ్‌వో ధనరాజ్



డాక్టర్ ధనరాజ్

నిర్మల్‌చైన్‌గేట్: వర్షాకాలం.. వ్యాధుల కాలమని.. వర్షాలతోపాటు వ్యాధులు ముసురుకుంటాయని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్ తెలిపారు. డయేరియా, మలేరియా, చికున్‌గన్యా, డెంగీతోపాటు వైరల్ ఫీవర్లు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స ఏర్పాట్లపై 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

సాక్షి: వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, అవి రాకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలు ఏమిటి?

డీఎంహెచ్‌వో: వర్షాకాలంలో డయేరియా (నీళ్ల విరోచనాలు), టైఫాయిడ్, మలేరియా, డెంగీ, జపనీస్ ఎన్సెఫలైటీస్, చికున్‌గన్యా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో జిల్లా వ్యాప్తంగా 'డ్రై డే' నిర్వహిస్తున్నాం. ఆశ కార్యకర్తలతో హైరిస్క్ గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నాం. మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఐసీడీఎస్ శాఖల సమన్వయంతో పారిశుధ్యం, సురక్షిత తాగు నీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

సాక్షి: ముంపు గ్రామాల్లో వ్యాధుల నియంత్రణ, చికిత్సకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారా?

డీఎంహెచ్‌వో: జిల్లాలో ముంపు గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తాం. పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తాం.

సాక్షి: సీజనల్ వ్యాధుల చికిత్సకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా?

డీఎంహెచ్‌వో: జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల్లో సీజనల్ వ్యాధుల చికిత్సకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. మందులు లేవని ఎవరైనా చెబితే మాకు ఫిర్యాదు చేయాలి.

సాక్షి: ఈ ఏడాది ఇప్పటి వరకు ఎన్ని డెంగీ కేసులు నమోదయ్యాయి?

డీఎంహెచ్‌వో: జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు డెంగీ కేసులు నమోదు కాలేదు. గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణాలు, గ్రామాల్లో హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి డెంగీ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాం. జూలై 1 నుంచి హైరిస్క్ ప్రాంతాల్లో 12 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ద్వారా హౌస్ టూ హౌస్ ఫీవర్ సర్వే, శానిటేషన్ సర్వే నిర్వహిస్తున్నాం.

సాక్షి: డెంగీతో ఎలాంటి ప్రమాదం ఉంది?

డీఎంహెచ్‌వో: సాధారణంగా ఒక వ్యక్తి రక్తంలో 4.50 లక్షల ఎర్ర రక్త కణాలు ఉంటాయి. డెంగీ సోకితే అవి తగ్గుతాయి. 20 వేల వరకు తగ్గినా ఇబ్బంది ఉండదు. తిరిగి వాటంతట అవే వృద్ధి చెందుతాయి. రక్తకణాలు తగ్గితే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలి.

సాక్షి: జిల్లాలో పాముకాటుకు మందులు అందుబాటులో ఉన్నాయా?

డీఎంహెచ్‌వో: వర్షాకాలం కావడంతో పాటుకాటు కేసులు నమోదవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్సీలు, ప్రభుత్వ ఆస్పత్రులలో యాంటీ స్నేక్ వీనం అందుబాటులో ఉంచాం. పాము కరిస్తే భయాందోళనకు గురికాకూడదు. ఆస్పత్రికి వస్తే చికిత్స అందిస్తాం. తేలు, కుక్క కాటుకు సైతం అన్ని ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయి.

సాక్షి: జిల్లాలో బర్త్ వెయిటింగ్ సెంటర్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు?

డీఎంహెచ్‌వో: గర్భిణులు డెలివరీ కోసం ఆసుపత్రులకు వచ్చే సమయంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఇబ్బంది పడకుండా బర్త్ వెయిటింగ్ సెంటర్లు ఏర్పాటుచేశాం. నర్సాపూర్(జి), కుభీర్, కడెం, జిల్లా ప్రసూతి ఆసుపత్రి, భైంసా ఏరియా ఆస్పత్రిలో బర్త్ వెయిటింగ్ సెంటర్లు ఏర్పాటు చేశాం. వీరు డెలివరీ సమయం కంటే ముందుగా వచ్చి ఇక్కడ ఉండొచ్చు.

సాక్షి: ఇంటింటి సర్వేకు ఎన్ని టీంలు ఏర్పాటు చేశారు?

డీఎంహెచ్‌వో: ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలతోపాటు ప్రతీరోజు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా 701 టీంలు ఏర్పాటు చేశాం. ఈ టీంలు ప్రతీరోజు ఇంటింటికీ వెళ్లేలా ప్రణాళిక రూపొందించాం. జిల్లా వ్యాప్తంగా 1,86,345 గృహాలు సందర్శించాలని లక్ష్యంగా నిర్దేశించాం.

సాక్షి: ఈ కాలంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలి?

డీఎంహెచ్‌వో: రహదారుల వెంట విక్రయించే ఆహార పదార్థాలు తినొద్దు. ఇంట్లో వేడివేడిగా వండిన ఆహారం తీసుకోవాలి. చల్లబడిన ఆహారం తీసుకోవద్దు. కాచి చల్లార్చిన నీటినే తాగాలి.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌పై పూలు చల్లుతూ స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

- కలెక్టర్ అభిలాష అభినవ్
- పెంబిలో సంపూర్ణత అభియాన్ ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

పెంబి: అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. నీతి అయోగ్ ఆధ్వర్యంలో సంపూర్ణత అభియాన్‌కింద చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం శ్రీకారం చుట్టారు. తొలిసారిగా మండలానికి వచ్చిన కలెక్టర్‌పై విద్యార్థులు పూలవర్షం కురిపించి స్వాగతం పలికారు. జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విద్య, వ్యవసాయం, ఐకేపీ, అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. తర్వాత కలెక్టర్ మాట్లాడుతూ.. పెంబి మండలం అన్నిరంగాల్లో వెనుకబడి ఉండడంతో నీతిఅయోగ్ ఆస్పిరేషనల్ మండలంగా ఎంపిక చేసిందని తెలిపారు. సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో అన్నిరంగాల్లో మండలాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రతీ గ్రామంలో కమిటీ ఏర్పాటు చేసుకుని గ్రామ సభలు నిర్వహించి నీతిఅయోగ్ ద్వారా ఏయే పనులు చేపట్టాలో చర్చించాలని తెలిపారు. మండలంలో టెలి మెడిసిన్ గ్రామాలవారీగా ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో ధనరాజ్‌కు సూచించారు. ఈ సందర్భంగా గర్భిణులు తమకు అంబులెన్స్ అందుబాటులో లేదని తెలుపగా పీహెచ్‌సీలో అంబులెన్స్ అందుబాటులో ఉంచుతామని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆదివాసీ, లంబాడా నృత్యాలు ఆకట్టుకున్నాయి. మందపల్లి కేజీబీవీ విద్యార్థులు రైతుల ఆత్మహత్యలపై ప్రదర్శించిన నృత్య రూపకం ఆలోచింపజేసిందని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పలువురు వివిధ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో నీతి అయోగ్ స్పెషల్ ఆఫీసర్ సుమేధాకపూర్, డీపీవో శ్రీనివాస్, డీఈవో రవీందర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో గోవింద్, మండల పరిషత్ స్పెషల్ ఆఫీసర్ నరసింహారెడ్డి, డీఎంహెచ్‌వో ధనరాజ్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఏవో అంజిప్రసాద్, ఐసీడీఎస్ పీడీ నాగమణి, డీఎల్‌పీవో రమేష్, ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో రత్నాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు స్వప్నీల్‌రెడ్డి, శంకర్, వైద్య, అంగన్‌వాడీ, ఐకేపీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ పిల్లలను చేరదీసిన అధికారులు



అనాథ పిల్లలతో అధికారులు

కుంటాల: కుంటాలకు చెందిన సాంగి హంస–శ్రీనివాస్ దంపతులు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో వారి పిల్లలు అక్షయ, అనుప్రియ అనాథలయ్యారు. జిల్లా మహిళా సంక్షేమ అధికారి ఎ.నాగమణి ఆదేశాల మేరకు అనాథ పిల్లలను అధికారులు శనివారం చేరదీశారు. నిర్మల్ బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద, బాలల సంరక్షణ అధికారులు సగ్గం రాజు, ఓస శ్రీనివాస్, కరుణశ్రీ పాల్గొన్నారు.

బదిలీలపై ఎంఈవోల పెత్తనం

- ముధోల్ మండలం కారేగాం ఎంపీపీఎస్‌కు చెందిన ఉపాధ్యాయుడు భైంసా మండలం ఎగ్గాంకు ఇటీవల బదిలీ అయ్యాడు. ఈ మేరకు ఎంఈవో రిలీవ్ చేశారు.
- ముధోల్ మండలం పిప్రి ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు భైంసా మండలం మాటేగాంకు బదిలీపై రిలీవ్ అయ్యాడు.
- కడెం మండలం ఎంపీయూపీఎస్‌కు చెందిన ఉపాధ్యాయురాలు జిల్లా కేంద్రంలోని గాజులపేట పాఠశాలకు బదిలీపై వెళ్లారు. అయితే తిరిగి పాత స్థానంలోనే చేరాలంటూ సదరు ఎంఈవో ఆమెకు ఫోన్ చేసి సూచించినట్లు తెలిసింది.

ఇలా జిల్లాలో పలుచోట్ల రేషనలైజేషన్ నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయులను ఎంఈవోలు రిలీవ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం వారిని వెనక్కి రావాలంటూ సూచిస్తున్నారు. ఇక కొన్నిచోట్ల నిబంధనల మేరకు రిలీవ్ చేయాల్సి ఉన్నా చేయకుండా ఎంఈవోలు ఇబ్బంది పెడుతున్నారు. కుభీర్ మండలం గొడిసెర మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా, నిబంధనల మేరకు ఇద్దరు మాత్రమే అవసరం. అయినా అక్కడి నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయుడిని రిలీవ్ చేయడం లేదని ఉపాధ్యాయ సంఘ నాయకులు తెలిపారు.

- ఉపాధ్యాయుల రిలీవ్‌లో ఇష్టారాజ్యం
- ఇప్పటికే బదిలీ స్థానాలకు వెళ్లిన ఉపాధ్యాయులు
- విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలతో ట్రాన్స్‌ఫర్స్
- తిరిగి పాత పాఠశాలలకు రావాలని మౌఖిక ఆదేశాలు

భైంసాటౌన్: ఉపాధ్యాయులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న బదిలీల పక్రియ ఎట్టకేలకు పూర్తయింది. బదిలీ అయిన ఉపాధ్యాయులు ఇప్పటికే బదిలీ పాఠశాలల్లో చేరారు. రేషనలైజేషన్ నిబంధనల ప్రకారం బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని విద్యాశాఖ కమిషనర్ నుంచి ఆదేశాలున్నాయి. అయితే, జిల్లాలో కొందరు ఎంఈవోలు రేషనలైజేషన్ నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయుల రిలీవ్ చేపట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో నిబంధనలకు విరుద్ధంగా రిలీవ్ చేసిన ఉపాధ్యాయులను వెనక్కి రప్పించాలని ఆదేశాలు అందినట్లు తెలిసింది. ఎక్కడైనా పొరబాటు జరిగితే సంబంధిత మండల విద్యాధికారులే బాధ్యత వహించాలని ఆదేశాల్లో పేర్కొన్నట్లు సమాచారం. జిల్లాలోనూ నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయుల రిలీవ్ జరగడంతో ఎంఈవోలు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. పాత స్థానాలకు చేరుకోవాలంటూ ఎంఈవోల నుంచి మౌఖిక ఆదేశాలు అందినట్లు తెలిసింది. కొందరు సెల్‌ఫోన్లకు మెస్సేజ్‌లు పంపుతున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

జిల్లాలో ఇలా...

ఎన్నో ఏళ్ల తరువాత బదిలీలు జరుగడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. అయితే, ఆ సంతోషం ఎంతోసేపు నిలవలేదు. ఎందుకంటే ఇటీవల జరిగిన ఎస్జీటీల బదిలీల్లో చాలామంది రిలీవ్ కాలేదు. విద్యాశాఖ రేషనలైజేషన్ నిబంధనలకు లోబడి రిలీవ్ చేయాలని విద్యాశాఖ కమిషనర్ నుంచి ఆదేశాలున్నాయి. దీంతో చాలాచోట్ల విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో ఉపాధ్యాయులు బదిలీ అయినా వారి స్థానాల్లో కొత్తగా చేరే ఉపాధ్యాయులు లేకపోవడంతో రిలీవ్ చేయడం లేదు. కొత్త టీచర్లు వచ్చేవరకు బదిలీ అయిన ఉపాధ్యాయులు యథాస్థానంలో కొనసాగాల్సి ఉంది. జిల్లాలో 747 మంది ఎస్జీటీలు బదిలీ కాగా, 552 మందిని రిలీవ్ చేశారు. రేషనలైజేషన్ నిబంధనల కారణంగా 195 మంది పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు.

ఎంఈవోలపై చర్య తీసుకోవాలి...

బదిలీ అయిన ఉపాధ్యాయులు రిలీవ్ ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించిన ఎంఈవోలపై చర్య తీసుకోవాలి. ఇష్టారాజ్యంగా రిలీవ్ చేయడంతో ఇప్పుడు దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు. కొన్నిచోట్ల నిబంధనల ప్రకారం రిలీవ్ చేయాల్సి ఉన్నా ఉద్దేశపూర్వకంగా చేయడంలేదు.
– భూమన్నయాదవ్, ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు

నిబంధనల మేరకు రిలీవ్.

ప్రభుత్వ రేషనలైజేషన్ నిబంధనల ప్రకారం బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని ఎంఈవోలను ఆదేశించాం. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా రిలీవ్ చేస్తే వెంటనే వారిని వెనక్కి రప్పించాలని సూచించాం. రేషనలైజేషన్ ప్రకారం రిలీవ్ చేయని పక్షంలో మా దృష్టికి తేవాలి.
– రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

క్లుప్తంగా

అమ్మవారి సన్నిధిలో ఐఆర్ఎస్ చీఫ్ పూజలు


కుంకుమార్చన జరిపిస్తున్న వేద పండితుడు

బాసర: శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో ఐఆర్ఎస్ చీఫ్ కమిషనర్ కస్టమ్స్ అండ్ జీఎస్టీ సందీప్ ప్రకాశ్ శనివారం పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదం అందజేశారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


దాడుల్లో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు

కడెం: మండలంలోని నర్సాపూర్, మాసాయిపేట్, నచ్చన్ఎల్లాపూర్, లక్ష్మీసాగర్, కొత్త మద్దిపడగ గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. 2 వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. నాలుగు కేసులు నమోదు చేసి, ఒకరిని అరెస్ట్ చేశామని ఎక్సైజ్ ఎస్సై వసంత్‌రావు తెలిపారు. ఆదిలాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సి.నర్సింహారెడ్డి ఆదేశాలతో దాడులు నిర్వహించామన్నారు. ఇందులో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్‌హుస్సేన్, సిబ్బంది వెంకటేశ్, ఇర్ఫాన్, ముత్యం, భాస్కర్, కల్పన, తదితరులు ఉన్నారు.

డిగ్రీ కాలేజీలో అధ్యాపకులను నియమించండి


వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్

ముధోల్: ముధోల్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని మాజీ సర్పంచ్ వెంకటాపురం రాజేందర్ కోరారు. ఈమేరకు ఆర్‌జేడీ జి.యాదగిరి, ఆర్‌జేడీ డీఎస్ఆర్ రాజేందర్‌సింగ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని విద్యాభవన్‌లో వారిని కలిసి సమస్యలను విన్నవించినట్లు రాజేందర్ తెలిపారు. సమస్యల పరిష్కారానికి అధికారులు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

బ్లేడ్‌తో గొంతు కోసుకుని హంగామా..


యువకుడిని అడ్డుకుంటున్న ఎస్సై ఇమ్రాన్

గుడిహత్నూర్: బ్లేడ్‌తో యువకుడు గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన యువకుడు అదే కాలనీకి చెందిన యువతిని ప్రేమించుకుంటున్నారు. శనివారం యువతి ఇంటికి వచ్చిన సదరు యువకుడు తమకు పెళ్లి చేయాలని కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. ముందు ఉద్యోగం చేసుకోమని చెప్పడంతో యువకుడు గొంతుకోసుకుని చనిపోతానని హంగామా సృష్టించాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని యువకుడిని అడ్డుకుని రిమ్స్‌కు తరలించారు. ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుంటామని ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

పర్యాటకంపై నీలినీడలు

- జలపాతాల వద్ద అభివృద్ధి కరువు
- రోడ్డు సౌకర్యాలు లేవు
- పర్యాటకులకు తప్పని ఇక్కట్లు


పరిశీలిస్తున్న కలెక్టర్, ఉన్నతాధికారి (ఫైల్)


కుంటాల జలపాతం వద్ద పర్యాటకులు (ఫైల్)

ఇచ్చోడ: పర్యాటకరంగం అభివృద్ధిపై నీలినీడలు అలుముకుంటున్నాయి. నిధుల కొరత కారణంగా జలపాతాల అభివృద్ధికి అడుగులు పడడం లేదు. జిల్లాలో సహజసిద్ధంగా ఏర్పడిన జలపాతాలు ఎన్నో ఉన్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు వీటిని వీక్షించేందుకు వస్తుంటారు. సరైన రోడ్లు, రిసార్ట్‌లు లేకపోవడంతో వారికి ఇక్కట్లు తప్పడం లేదు. పొచ్చెర, గాయత్రి, కనకాయి, వాకిండి, పెద్ద గుండమ్, కొరిటికల్, ఘన్‌పూర్ తదితర జలపాతాలు ఉన్నాయి. పొచ్చెర మినహా మిగతా జలపాతాల సందర్శించడానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. గాయత్రి, కనకాయి, ఘన్‌పూర్ జలపాతాలకు వెళ్లాలంటే కిలోమీటర్ల దూరాన కాలినడకన వెళ్లాలి.

'కుంటాల'కు నిధులు లేకనే..

రాష్ట్రంలో ఎత్తైనది జలపాతాల్లో కుంటాల ఒకటి. నిధులు లేక ఈ జలపాతం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. పర్యాటకులు ఇక్కడ సేద తీరుదామంటే సౌకర్యాలు లేవు. రాష్ట్ర పర్యాటక, అటవీశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీలు గతంలో ఈ జలపాతాన్ని సందర్శించారు. రోప్‌వే ఏర్పాటు చేసి కుంటాల దిగువ భాగంలో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తామని చెప్పి నిధులు మంజూరు చేయలేదు. 2022లో రిసార్ట్స్‌లు నిర్మించడానికి రూ.3.81 కోట్లు మంజూరు చేస్తున్నట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర స్వదేశీ దర్శన్ పథకం కింద నిర్మిస్తామని పేర్కొంది. గిరిజన సంస్కృతి ప్రతిబింబించేలా ఎకో ఎథెనిక్ రిసార్ట్ నిర్మిస్తామని చెప్పి దాదాపు నాలుగేళ్లు గడుస్తున్నా దాని ఊసేలేదు.

స్థల సేకరణకు ఆదేశాలు

ఇటీవల జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తాలు కుంటాల జలపాతాన్ని సందర్శించారు. కుంటాల వద్ద హరితరిసార్ట్స్, కాటేజీల స్థల సేకరణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం జిల్లాలోని జలపాతాలకు రోడ్ల సౌకర్యం కల్పించి, అభివృద్ధి చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

పర్యాటకుల తాకిడి

ఏటా జూన్ నుంచి అక్టోబర్ వరకు జలపాతాల వద్ద పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. కుంటాల జలపాతంలో ఎగిసిపడుతున్న నీటిని చూడాలంటే దాదాపు 408 మెట్లు కాలినడకన కిందికి దిగాలి. వయస్సుపైబడిన వారికి అంతా సులువుకాదు. పర్యాటకులు భారీగా వస్తుంటారు.

రోప్‌వే ఏర్పాటు చేయాలి



జలపాతం అందాలు వీక్షించాలంటే ఎత్తు నుంచి కిందికి దిగాలి. వయస్సు పైబడిన వారు దిగడం కష్టంగా ఉంది. రోప్‌వే ఏర్పాటు చేస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది.
– సత్యనారాయణ, పర్యాటకుడు, నిజామాబాద్

స్థల సేకరణ తర్వాతే..



టూరిజం శాఖ ద్వారా ప్రభుత్వం రూ.3.81 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసింది. స్థల సేకరణ తర్వాత పనులు ప్రారంభిస్తాం. రెస్టారెంట్ ట్రైబల్ హట్స్ నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.
– రాథోడ్ భీంరావు, ఐటీడీఏ, ఈఈ ఉట్నూర్

రిసార్ట్ ఏర్పాటు చేయాలి



దూరప్రాంతాల పర్యాటకులు బస కోసం నిర్మల్ లేదా ఆదిలాబాద్‌కు వెళ్తున్నారు. అటవీప్రాంతంలో రిసార్ట్ ఏర్పాటు చేయాలి. అక్కడి అందాలను వీక్షించడం అనుభూతి కలుగుతుంది.
– సురేందర్‌రెడ్డి, పర్యాటకుడు, హైదరాబాద్

'వంతెన కష్టాలపై' వివరాలివ్వండి

- అధికారులను ఆదేశించిన సీఎం కార్యాలయం

సాక్షి స్పందన

బోథ్: మండలంలోని నక్కలవాడ, ధన్నూర్(బి) గ్రామాల వద్ద లోలెవల్ వంతెనలతో వర్షాకాలంలో ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సాక్షిలో శనివారం 'వంతెన కష్టాలు..'శీర్షికన ప్రచురితమైన కథనానికి సీఎం కార్యాలయం స్పందించింది. పూర్తి వివరాలను అందించాలని అధికారులను ఆదేశించింది. పంచాయతీరాజ్ శాఖ అధికారులు కలెక్టర్ రాజర్షిషాకు నివేదించారు. ఇప్పటికే రెండు వంతెనల నిర్మాణానికి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నక్కలవాడ వద్ద గల వంతెనకు మరమ్మతుకు రూ.17.90 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. నూతన వంతెన నిర్మాణానికి రూ.8.60 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శివరాజ్ తెలిపారు. రూ.8.60 కోట్ల ప్రతిపాదనతో ధన్నూర్ వద్ద వంతెన నిర్మాణ కోసం పరిశీలించాలని అధికారులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆదేశించారు.

డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పరీక్షల విభాగం అధికారులు

- 50.10 శాతం ఉత్తీర్ణత

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈఏడాది ఏప్రిల్, మేలో నిర్వహించిన బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీవోకేషనల్ కోర్సుల ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు శనివారం సాయంత్రం రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి విడుదల చేశారు. పరీక్షలకు 46,130 మంది విద్యార్థులు హాజరుకాగా 23,114 మంది (50.10)శాతం ఉత్తీర్ణులయ్యారు. బాలురు 22,355 మంది హాజరుకాగా 8,465 మంది (37.87శాతం), బాలికలు 23,784 మంది హాజరుకాగా 14,649 మంది (61.59శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు వారు పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా ఫలితాలు

కేయూ పరిధిలో డిగ్రీ ఆరో సెమిస్టర్ల పరీక్షల ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 18,881 మంది విద్యార్థులకుగాను 9,657 మంది (51.15) ఉత్తీర్ణత సాధించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11,809 మంది విద్యార్థులకుగాను 6,352 మంది (53.79శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 15,449 మంది విద్యార్థులకు గాను 7,105 మంది (45.99శాతం) ఉత్తీర్ణత సాధించారు. పరీక్షల ఫలితాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు

డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసిన నేపథ్యంలో విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ నెల 7నుంచి 22వరకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న పుర్క బాపురావు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు డిమాండ్ చేశారు. ఉట్నూర్ గుస్సాడిగుట్టలో శనివారం తుడుందెబ్బ అనుబంధ సంఘాల జిల్లా ఆదివాసీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని, జీవో ఎంఎస్ 3ను చట్టం చేయాలని పేర్కొన్నారు. గ్రామాలకు రోడ్డు సౌకర్యంతోపాటు ఆదివాసీలకు ఇంటి స్థలంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలన్నారు. ఆదివాసీల ఆరాధ్యదైవం ఇంద్రాదేవి, ఆదిలాబాద్ ముత్యాలమ్మ దేవతల భూ వివాదాన్ని పరిష్కరించాలన్నారు. ఐటీడీఏ ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో అంబులెన్స్ కేటాయించాలని, పీహెచ్‌సీల్లో వైద్యులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 20న నిర్వహించే తుడెం దెబ్బ వ్యవస్థాపక సభ్యుడు సిడాం శంభు వర్ధంతిని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పరాణి, మర్సుకోల అశోక్, సోయం రాందాస్, భరత్, కనక ప్రభాకర్, సోయం భీంరావు, గంగారాం, పృథ్వీరాజ్, మడావి జంగు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ధర్మాబాద్ వద్ద ఆటోను ఢీకొన్న బొగ్గు లారీ
- ప్రమాదంలో ముగ్గురు మృతి


ప్రమాదానికి గురైన ఆటో


మృతి చెందిన వ్యక్తి

బాసర: తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు గ్రామం ధర్మాబాద్ వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటోను బొగ్గు లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందగా, ఒకరికి తీవ్రగాయాలై చికిత్స పొందుతున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని ధర్మాబాద్ వద్ద రత్నెల్లికి చెందిన నలుగురు ఆటోలో నిజామాబాద్ జిల్లా నవీపేటలో మేకల అంగడి కోసం శనివారం వచ్చారు. నాలుగు మేకలు కొనుగోలు చేసి తిరుగు పయనమయ్యారు. ధర్మాబాద్ నుంచి బొగ్గు లారీ నిజామాబాద్ వైపు వెళ్తుండగా ధర్మాబాద్ చెక్‌పోస్ట్ వద్ద ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ మహమ్మద్ ముజీబ్(45) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన ఇద్దరిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. మహారాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలి

- యూనియన్ జిల్లా కార్యదర్శి లలిత


ఏవోకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు


కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.లలిత కోరారు. 65 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సర్వీస్‌ను ప్రభుత్వం నిలిపివేసిన నేపథ్యంలో టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష చొప్పున రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్‌గా చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట శనివారం నిరసన దీక్ష చేపట్టారు. అంతకుముందు కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ గత ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్ ప్రకటించిందన్నారు. నాడు ఇది సరిపోదని కాంగ్రెస్ నాయకులే మాట్లాడారని, ఇప్పుడు అధికారంలోకి ఉన్న కాంగ్రెస్ తక్కువగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం సరికాదన్నారు. నిరసన దీక్షలో ప్రసాద, సునీత తదితరులు పాల్గొన్నారు

కైలాస్‌నగర్: అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. జిల్లా నుంచి తరలివచ్చిన అంగన్‌వాడీలు, ఆయాలు స్థానిక సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యాలయ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, నాయకులు సునీత, రత్నమాల, సుభద్ర కుశివర్త, విజయ పద్మ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య


మధుకర్ (ఫైల్)


భోజన్న మృతదేహం

బోథ్: మండలంలోని మర్లపెల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు సంపెంగల భోజన్న (71) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాము కథనం ప్రకారం..భోజన్న గతకొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సోన్‌లో..

సోన్: గుర్తుతెలియని పురుగుల మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై గోపి కథనం ప్రకారం.. మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన నక్కల మధుకర్ (24) మద్యానికి బానిసయ్యాడు. వ్యవసాయం చేసుకుని బతకాలని తల్లిదండ్రులు మందలించారు. ఈనెల 1న ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబీకులు నిర్మల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి పంపించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. తల్లి లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


అనుమానం పెనుభూతమై..

- భార్యను హత్య చేసిన భర్త


నస్రీన్ బేగం మృతదేహం

నిర్మల్‌రూరల్: భార్యపై అనుమానంతో భర్త హత్య చేసిన ఘటన జిల్లా కేంద్రంలో శనివారం కలకలం రేపింది. రూరల్ ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని వైఎస్సార్‌నగర్ కాలనీలో నస్రీన్ బేగం (40), అబ్దుల్ అజీజ్ నివాసం ఉంటున్నారు. భార్యపై అనుమానంతో తరచూ కుటుంబంలో గొడవలు జరిగేవి. కొన్నిరోజులుగా అబ్దుల్ అజీజ్ ఆటో నడుపుకుంటూ ఒంటరిగా మహాలక్ష్మివాడలో నివాసం ఉంటున్నాడు. విడాకులు ఇవ్వమని భార్యతో గొడవపడేవాడు. ఈక్రమంలో శనివారం వైఎస్సార్‌నగర్ కాలనీకి చేరుకుని ఆమెతో గొడవపడ్డాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడిచేశాడు. తీవ్ర గాయాలై నస్రీన్ బేగం అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో రూరల్ ఎస్సై సాయికుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి నలుగురు పిల్లలు ఉన్నారు.

నిలకడగా 'కడెం' నీటిమట్టం



కడెం: కడెం ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా కొనసాగుతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700(7.603టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 677.925(3.180టీఎంసీ) అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థుల భయం పోగొట్టాలని..


పాఠశాలలో నిద్రిస్తున్న ఉపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి

జైనథ్: పాఠశాలలో దెయ్యం ఉందని విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ఓ ఉపాధ్యాయుడు తరగతి గదిలో నిద్రించాడు. మండలంలోని ఆనంద్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో గత కొన్నేళ్లుగా దెయ్యం ఉందన్న పుకారు షికారు చేస్తున్నాయి. ఈనెల 2న బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుడు నూతుల రవీందర్ పాఠం చెబుతుండగా, బయట ఏదో జరిగిన అలజడితో విద్యార్థులు హడలిపోగా, ఏమైందని ప్రశ్నిస్తే 5వ తరగతిలో దెయ్యం ఉందని భయపడుతూ చెప్పారు. ఈ కారణంగా గతేడాది ఓ విద్యార్థి ప్రైవేట్ పాఠశాలకు వెళ్లినట్లు తెలిపారు. దెయ్యం లేదని టీచర్ చెబితే నమ్మలేదు. అమావాస్య రోజు ఒక్కరే పాఠశాలలో నిద్రిస్తే దెయ్యం లేదని నమ్ముతామని కొందరు విద్యార్థులు విసిరిన చాలెంజ్‌ను ఆయన స్వీకరించారు. స్వతహాగా జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన శుక్రవారం 5వ తరగతి గదిలో నిద్రించాడు. విద్యార్థులు వాటి ఫొటో, వీడియో చూసి దెయ్యం లేదని నమ్మారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడిని గ్రామస్తులు అభినందించారు.

సాగులో సగమై..



ముధోల్ మండలంలోని బిద్రెల్లి గ్రామానికి చెందిన రైతు కాశీనాథ్ ముధోల్ శివారు ప్రాంతంలో తనకున్న ఎనిమిదెకరాల్లో ఈ ఏడాది సోయా పంట వేశాడు. అందులో కలుపు మొక్కలు పెరగడంతో తన కున్న సైకిల్‌కు రెండు దారాలు బిగించాడు. కాశీనాథ్ సైకిల్ లాగుతుండగా వెనకాల అతని భార్య సుమన్‌బాయి పట్టుకుని దౌర కొడుతూ కనిపించారు. - ముధోల్